www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 17 మే 2025
5
కాకినాడ



నేడు జగ్గంపేటలో మినీ మహానాడు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక గోకవరం రోడ్డులోని కాపు కళ్యాణ మండపంలో శనివారం టిడిపి మినీ మహానాడును నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం 4 గంటలకు మినీ మహానాడును నిర్వహిస్తామన్నారు. మహానాడులో పార్టీ సంస్థాగత ఎన్నికలు, పార్టీ పటిష్టత కోసం పలు తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 22న జిల్లా మహానాడు, 27, 28, 29 తేదీల్లో కడపలో మహానాడును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, మండల టిడిపి అధ్యక్షులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు

- పొలాల ఎత్తు పేరుతో యథేచ్ఛగా రవాణా
- ఇటుక బట్టీలకు భారీగా తరలింపు
- రూ.కోట్లలో వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వంలోనూ మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వ పాలనలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి, జనసేన పార్టీల నేతలు తీవ్ర స్థాయిలో విమర్శించారు. అనుమతులు లేకుండానే అక్రమంగా మట్టిని తవ్వేసుకుంటున్నారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు గుప్పించారు. మట్టిని కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే కూటమి పార్టీల నేతలు అదే మట్టిని కొల్లగొడుతూ రూ.కోట్లలో వ్యాపారం సాగిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా పొలాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా మట్టి అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు కూటమినేతలపై పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఏర్పడింది. ఇటు రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తుతున్నట్లు వ్యవహరిస్తున్నారు. కొందరైతే అధికార పార్టీ నేతలు ఇస్తున్న ఆమ్యామ్యాలు మట్టి తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వారిపై గట్టిగానే వినిపిస్తున్నాయి.

ప్రత్తిపాడు నియోజకవర్గం వేలంక చెరువు నుంచి గత కొంతకాలంగా అక్రమంగా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ నుంచి పెద్ద ఎత్తున మట్టి ఇటుక బట్టీలు, లే అవుట్స్ పిల్లింగులకు రాత్రింబవళ్ళు వందలాది లారీలు తిరుగుతున్నాయి. ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారిపై నిబంధనలు విరుద్ధంగా మట్టి లారీలు రవాణా సాగిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారిపై సుమారు కిలో మీటర్ మేర రాంగ్ రూట్‌లో లారీలు మట్టి రవాణా చేస్తున్నాయని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎవరికైనా ప్రాణ హాని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అంటున్నారు. అధికార పార్టీ కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని, రూ. కోట్లలో మట్టిని కొల్లగొడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రం ప్రత్తిపాడు, ధర్మవరంలలో కూడా అక్రమ మట్టి తోలకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటు



పిఠాపురం మండలం ఎఫ్‌కె.పాలెంలో రైతుల అర్ధనగ్న ప్రదర్శనలో నిరసన

జగ్గంపేట మండలం మామిడాడలో సుమారు 20 ఎకరాల కొండ పొలంలో గత నెల రోజులుగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఇవి జిరాయితీ భూములు కావడంతో ఇష్టారాజ్యంగా మట్టి అక్రమ రవాణా సాగుతోంది. స్థానిక ఎంఎల్‌ఎ కుమారుడు జ్యోతుల నవీన్ కనుసన్నల్లో జరుగుతున్నా ఈ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవన్నది స్థానికుల ఆరోపణ. అధికారం చేతిలో ఉండడంతో ప్రభుత్వ నిబంధనలను పాటించకుండానే జరుగుతున్నాయి. ఇదే నియోజకవర్గంలోని పోలవరం కాలువ పక్కన వేసిన మట్టిని కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు తరలించుకుని పోతున్నా అధికారులు ఎవరూ మాట్లాడడం లేదు. గత కొన్ని నెలలుగా ఈ తంతు జరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు.

ప్రయివేటు లే అవుట్‌లకు ఈ మట్టి పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. కిర్లంపూడి మండలం జగపతినగరం, సింహాద్రిరాజు చెరువులో కూడా గత కొంతకాలంగా యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. జగ్గంపేటలో కొన్ని ప్రయివేటు లే అవుట్స్‌లకు తరలిస్తున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గండేపల్లి మండలం బొర్రంపాలెంలో గల ఒక పెద్ద చెరువులో అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇదే మండలంలోని గోపాలపురం, రామేశ్వరంపేటలలో గత నాలుగేళ్లుగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి కొంతమేర అనుమతులు తీసుకుని అనధికారికంగా గ్రావెల్‌ను వందల లారీల్లో తరలించకపోతున్నారు. పోలవరం ఎడమ కాలువ మట్టిని, పుష్కర ప్రధాన కాలువ వెంబడి కూడా తవ్వకాలు జరుగుతున్నాయి.

డిప్యూటీ సిఎం ఇలాకాలో....

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం తాలూకాలోనూ మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. పిఠాపురం మండలం ఎఫ్‌కె.పాలెంలో గల పాపిడి దొడ్డి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలకు జనసేన నేతలు సిద్ధపడ్డారు. ఒక రైతు పేరుతో అనుమతి తీసుకుని ఆ రైతు పొలాన్ని చదును చేసేందుకంటూ ఇటుకుల బట్టి వ్యాపారులకు మట్టిని విక్రయించేందుకు సన్నద్ధమయ్యారు. రెండు రోజుల క్రితం చెరువులో యంత్రాలను దింపి పనులను మొదలుపెట్టగా ఎఫ్‌కె.పాలెం గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులంతా కలిసి అడ్డుకున్నారు. ఈ చెరువులో అక్రమంగా గనుక మట్టిని తవ్వితే రైతులకు పూర్తిగా సాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. కొందరు బట్టీల వ్యాపారుల ప్రయోజనాల కోసం అధికార పార్టీ నేతలు మట్టిని తరలించడానికి సిద్ధపడటం సరికాదంటూ నిలదీస్తున్నారు. ఈ చెరువులో గనక మట్టిని తవ్వుకుని పోతే సిల్ లెవెల్ స్థాయి కంటే సాగు నీరు క్రిందకు పోయి చుక్క సాగునీరు కూడా అందదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ చెరువు ఆధారంగా సాగయ్యే సుమారు 300 ఎకరాలకు ఏటా రూ.3 కోట్ల పైనే నష్టం వాటిల్లుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పరిస్థితిని వివరించి చెబుతున్నప్పటికీ అక్రమ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. హైకోర్టును ఆశ్రయించామని తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందని వారు తెలిపారు. గతంలో పవన్ కల్యాణ్ ఇక్కడ మట్టి అక్రమ తవ్వకాలను వ్యతిరేకించి అధికారంలోకి వచ్చాక ఎలా ప్రోత్సహిస్తారంటూ ఈ సందర్భంగా వారు ప్రశ్నిస్తున్నారు. స్థానిక జనసేన పార్టీలోని కొందరు నేతలు తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా జిల్లాలో పలుచోట్ల అధికార పార్టీ నేతలు అండదండలతో మట్టి మాఫియా రెచ్చిపోతుంది.

మట్టి అక్రమ తవ్వకాలపై అర్ధనగ్న నిరసన

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని ఎఫ్‌కె.పాలెం గ్రామంలో పాపిడిదొడ్డి చెరువులో చేపట్టిన మట్టి తవ్వకాలకు నిరసనగా రైతులు అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికే మట్టి తవ్వకాలను అడ్డుకున్నామని, అయితే బట్టి వ్యాపారులు తమ ప్రయత్నాలను నిలుపుదల చేయకపోవడంతో శుక్రవారం పాపిడిదొడ్డి చెరువు వద్ద రైతులు, గ్రామస్తుల్ను వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. అర్ధనగ్నంగా తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు జవ్వాది కృష్ణమాధవరావు, ముమ్మిడి వెంకన్నబాబు, మలిరెడ్డి పల్లపురాజు, రెడ్డి సత్యనారాయణ, జీను స్వామి, ఎఫ్‌కె.పాలెం, కందరాడ సర్పంచులు ముమ్మిడి శేఖర్, సైతన ప్రసాద్ మాట్లాడారు. తమ వ్యాపార స్వలాభాల కోసం కొందరు ఇటుకుల బట్టి వ్యాపారులు గ్రామంలోని చెరువులో ఉన్న మట్టిని అక్రమంగా తరలించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఒక రైతు పేరుతో అనుమతి తీసుకుని పెద్ద ఎత్తున మట్టిని తరలించేందుకు రెడీ అయ్యారన్నారు. గ్రామానికి చెందిన సుమారు 300 మంది రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. చెరువులో మట్టి తవ్వకాలను తక్షణమే నిలుపుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి చక్రరావు, వెన్నా అర్జునరావు, కర్రిపోతుల నల్లయ్య, కృష్ణ, మత్య దొంగబ్బాయి, మత్య చిన్నోడు, సామిదాల సత్తిబాబు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

కూటమి పాలనపై అసంతృప్తి

ప్రజాశక్తి - కాకినాడ

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉభయగోదావరి జిల్లాల వైసిపి సమన్వయ కమిటీ సమావేశం స్థానికంగా జరిగింది. సమావేశం వివరాలను మీడియాకు వివరించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామని, జూన్ 1 నుంచి 10 వరకూ సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబో యే 50 రోజుల్లో పార్టీ సంస్థాగత సమావేశాలు జర పాలని, గత ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ప్రజా సమస్యలపై నిరసనలు, వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. స్థానిక నాయకత్వాల ఆధ్వర్యంలో రైతాంగానికి అండగా నిర సనలు చేపడతామని అన్నారు. ఆక్వా రంగ సమస్య లపై పోరాటాలు చేస్తామన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చి న హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పనులపై నిష్పక్ష పాతంగా విచారణ జరిపించాలని కోరారు. ప్రజలు 40 శాతం ఓట్లు వైసిపికి వేశారని, ప్రజలే వైసిపికి ప్రతిపక్ష హోదా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్ చంద్రబోస్, ఎంఎల్‌సిలు కుడిపూడి సూర్య నారాయణ, తోట త్రిమూర్తులు, అనంతబాబు, వంక రవీంద్ర, మాజీ మంత్రులు తోట నరసింహం, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా, కురసాల కన్నబాబు, కారుమూరి నాగేశ్వర రావు, మాజీ ఎంపీలు వంగా గీత, మార్గాని భరత్‌రామ్, చింతా అనురాధ, పండుల రవీంద్ర బాబు, మాజీ ఎంఎల్‌ఎలు చిర్ల జగ్గిరెడ్డి, జ్యోతుల చంటిబాబు, పొన్నాడ సతీష్, రౌతు సూర్య ప్రకాశరావు, జక్కంపూడి రాజా, ముదునూరి ప్రసాద రాజు, జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రుడా మాజీ ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - సామర్లకోట

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెను శుక్రవారం చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాంకేతిక నిపుణత కలిగిన కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలని, 15 సంవత్సరాల సర్వీసు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం వేతనాల చెల్లింపులు జరపాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రామరాజు, కృష్ణ, రత్నరాజు, రమేష్, మురళీకృష్ణ, సత్యనారాయణ, భూదేవి, నాగార్జున, వెంకటేశ్వరరావు, స్వామి, రాజేష్, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు



అవగాహన కల్పిస్తున్న ఏలియారాజ్

పెరటి వ్యవసాయం ఆరోగ్యానికి ఎంతో మేలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పెరట్లో ప్రకృతి వ్యవసాయం ఎంతో ఆరోగ్యకరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ జె.ఎలియారాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక రింగ్స్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాలలో రింగులు ఏర్పాటు చేసుకుని ఇసుక, ఘనజీవామృతం, కోకో, ఫిట్, మట్టిని వినియోగించి శాశ్వత పెరటి తోటను తయారు చేసుకునే విధానంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన పోషకాలు గల ఆహారం లభిస్తుందని, తక్కువ ఖర్చుతో ఇంటి వద్దనే కూరగాయలు, ఆకుకూరలు పండించవచ్చునని అన్నారు. ఎన్ఎఫ్ఎ నాయుడు మాట్లాడుతూ ప్రతి మానవుడికి ఆరోగ్యం చాలా ముఖ్యమైనదని అన్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తుల ద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ గణేష్, యూనిట్ ఇన్‌ఛార్జ్ బివివి.సత్యనారాయణ, ముదర యేసుబాబు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

19 నుంచి ఎపిఇఎపి సెట్ పరీక్ష

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఎపి ఎప్సెట్ - 2025 ప్రవేశ పరీక్షలను జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎపి ఎప్సెట్ కన్వీనర్ వివి.సుబ్బారావు తెలిపారు. శుక్రవారం జెఎన్‌టియుకె విసి చాంబర్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఎపి ఎప్సెట్ ప్రవేశ పరీక్షల వివరాలను వెల్లడించారు. ఈ నెల 19, 20 తేదీల్లో వ్యవసాయ ఫార్మా విద్యార్థులకు, 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 145 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో రెండు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 3,62,418 మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో ఇంజనీరింగ్‌కు 2,80,578 మంది, వ్యవసాయ, ఫార్మసీ రంగాలకు 81,814 మందితో పాటు రెండు పరీక్షలు హాజరయ్యేవారు 912 మంది నమోదు చేసుకున్నారన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను ఈ నెల 12వ తేదీ నుంచి డౌన్లోడ్ చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హాల్ టికెట్లు వెనుక చిరునామాతో కూడిన క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. హాల్ టికెట్లు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష కేంద్రంలోకి గంటన్నర ముందుగా లోనికి పంపుతామని, నిమిషం దాటిన లోనికి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈనెల 21వ తేదీన వ్యవసాయ ఫార్మసీలు సంబంధించి, 28న ఇంజనీరింగ్ పరీక్ష సంబంధించి ప్రాథమిక కీని విడుదల చేస్తామన్నారు. నకిలీ వెబ్‌సైట్లకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. జెఎన్‌టియుకె విసి సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి పెంచవద్దని, పరీక్ష హాజరైన వారందరికీ వారి ప్రతిభను బట్టి ఆయా కళాశాలలో సీట్లు లభిస్తాయన్నారు. ఆందోళన చెందకుండా పరీక్ష రోజు ముందు రోజు రాత్రి ప్రశాంతంగా నిద్ర పోవాలన్నారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న సీట్ల సంఖ్య పెరిగిందని అందువల్ల విద్యార్థులందరికీ సీట్ల అందరికీ వస్తాయని అన్నారు. జూన్ నెల నుంచి జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో ఓరియంటల్ కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నామని, తద్వారా ఇంటర్ తర్వాత విద్యార్థులు ఏ కోర్సులు తీసుకోవాలో అవగాహన చేసేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రెక్టార్ కెవి.రమణ, ఒఎస్‌డి బి.కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ సుబ్బారావు

వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షునిగా వర్ధినీడి

ప్రజాశక్తి - పిఠాపురం

వైసిపి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షునిగా వర్ధినీడి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీతను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సద్వినియోగం చేసుకుని, నియోజకవర్గ నాయకత్వంతో సమన్వయం చేసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లా వైసిపి అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీతలకు కృతజ్ఞతలు తెలిపారు.



మాజీ ఎంపి వంగ గీతను కలిసిన వర్ధినీడి

నిధుల విడుదలకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పంచాయతీలకు రావాల్సిన కుడా నిధులను విడుదల చేసేందుకు ఎంఎల్‌ఎ పంతం నానాజీ కృషి చేయాలని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ కోరారు. శుక్రవారం రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిస్సహాయ స్థితిలో ఉన్న పంచాయతీలను బలోపేతం చేయడానికి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. బిల్డింగ్ ప్లాన్లు, లేఅవుట్లు, అపార్ట్‌మెంట్లు మంజూరు నిమిత్తం కుడా వసూలు చేస్తున్న రుసుంలో పంచాయతీల వాటాను ఎప్పటికప్పుడు కుడా నుంచి విడుదల అయ్యేలా ఎంఎల్‌ఎ పంతం నానాజీ దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - కరప

వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకుఅవగాహన కల్పించాలని ఇఒపిఆర్‌డి సలాది వెంకట శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని గొడ్డట్టుపాలెం గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని అన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోన అనూష, పంచాయతీ కార్యదర్శి సుధారాణి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించేందుకు కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమాజంలో ఎక్కడా బాల్యవివాహాలు జరగకుండా నిరోధించాలని చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన కిశోర వికాసం వేసవి శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బాల్యవివాహాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజంలో బాలికలను అనేక సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. బాలికలపై వేధింపులు, లింగ వివక్షత, మీడియా ప్రభావం, సైబర్ నేరాలు, ఆహార లోపం, అనారోగ్యాలు, వ్యక్తిగత శారీరక సమస్యలు, అక్రమ రవాణా తదితర నేరాలు సమూలంగా అరికట్టేలా అవగాహన పెంచాలన్నారు. సిడిపిఒ ఉష మాట్లాడుతూ బాలికల భవితకు భరోసాగా నిర్వహిస్తున్న కిశోర వికాసం వేసవి శిబిరాలు జూన్ 10వ తేదీ వరకు నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు పరమేశ్వరి, కీర్తి, సూపర్‌వైజర్ టివి.రమణమ్మ, సిఆర్‌ఎఫ్ ఎన్‌జిఒ బి.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు వసంత, సత్య, వాన కుమారి, ఎఎన్‌ఎం ఎ.రమణాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

పూర్తిస్థాయిలో ఉపాధి పనులు

ప్రజాశక్తి - కాజులూరు

ఉపాధి పనులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నామని ఎంపిడిఒ జె.రాంబాబు తెలిపారు. శుక్రవారం కాజులూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన రూ.307 వేతనాన్ని పూర్తిస్థాయి అందించేందుకు ఉపాధి కూలీలు సహకరించాలన్నారు. ఉపాధి పనులకు వస్తానన్న ప్రతికూలికి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలు పనిముట్లను వారే తీసుకురావాలని తెలిపారు. ఉపాధి కూలీలు నిర్దేశించిన సమయం కంటే ముందుగానే వచ్చి పనులు చేసుకుని వడదెబ్బ తగలకుండా చూసుకోవాలన్నారు.

బిల్లులు తప్పనిసరి

ప్రజాశక్తి - పెద్దాపురం


బంగారు ఆభరణాలు తయారీ, అమ్మకం దారులు వినియోగదారులకు తప్పనిసరిగా పూర్తి వివరాలతో బిల్లులు ఇవ్వాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక విశ్వబ్రాహ్మణ కల్యాణమండపంలో డివిజన్ వినియోగదారుల, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు భళ్లమూడీ సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన వర్తకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులో తూకం వివరాలు, ఇతర వివరాలు విడివిడిగా చూపించాలన్నారు. తూకాలు వేసే మిషన్‌లు రెన్యువల్ చేయించాలన్నారు.

ఏలేశ్వరంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నుంచి స్వర్గీయ వరుపుల రాజా రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రాజన్న యువసేన నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రస్థాయిలో సుమారు 100 జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్‌ను వరుపుల రాజా అభిమానులు, క్రీడా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్టూ'నిజం'



డెంగీ నివారణపై అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని తాటిపర్తి గ్రామంలోనూ, పట్టణంలోని ఎస్‌సి కాలనీలో జరిగిన అవగాహనా ర్యాలీలలో జిల్లా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ దానియేలు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు అమృతరావు పాల్గొని మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రతతో ఉంచాలని, నీరు నిలవ లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు లక్ష్మీరమణి, అహ్మద్ భాషా, రజిమ్ బీమ్, సచివాలయ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ ఎం.సౌభాగ్యసరోజ ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ఆనంద్ వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలంలోని రాజపూడి పిహెచ్‌సి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి నుంచి గ్రామ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యులు ఎస్.పూజ, మురళీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** మండలంలోని నాగులపల్లి గ్రామంలో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగులపల్లి పిహెచ్‌సి వైద్యురాలు ఎస్.సౌజన్య డెంగీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని మల్లం గ్రామంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఒ కె.దుర్గాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి బాలికలకు శిక్షణ ఇచ్చారు. రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆడపిల్లల ఆరోగ్యం రాబోయే తరాలకు ప్రభావితం చేస్తుందని, రానున్న సమాజాన్ని ఆరోగ్య వంతంగా చేయడానికి తొలి అడుగు ఇక్కడే పడాలన్నారు. ఐరన్ టాబ్లెట్స్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా అభివృద్ధి చేసుకోవాలి, బాలల హక్కులు చట్టాలు, కౌమర బాలబాలికల సమస్యలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహ నిర్మూలన చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు నాగమణి, ఎం.కృష్ణవేణి, పి.సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు గంగాభవాని, జ్యోతి, భారతి, జి.నూకరత్నం, బాలికలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు మహిళల అరెస్ట్

ప్రజాశక్తి - శంఖవరం

ఆర్‌టిసి బస్సుల్లో జరిగిన రెండు చోరీ కేసుల్లో ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ హరిబాబు వెల్లడించారు. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణికుల దృష్టిని మళ్లించి చోరీలకు పాల్పడిన వారిపై నమోదు అయిన కేసుల్లో విచారిస్తున్న నేపథ్యంలో అన్నవరం ఆర్‌టిసి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులో తీసుకుని విచారించినట్లు తెలిపారు. అన్నవరం స్టేషన్ పరిధిలో చోరీ అయిన బంగారం కేసులోను, ప్రత్తిపాడు స్టేషన్ పరిధిలో రూ.1.50 లక్షల నగదు చోరీ కేసులో ముద్దాయిలైన నక్క వెంకటేష్, నక్క మంగలను అరెస్టు చేసి వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి సెలవుల దృష్ట్యా ఎవరైనా తమ ఊరు విడిచి వేరే ప్రాంతానికి వెళ్లేటప్పుడు ఇంటికి తాళాలు వేయడంతోపాటు, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

చోరీ కేసులో నిందుతుని అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల పరిధిలో ద్విచక్రవాహనాలను చోరీలు చేసే నిందుతుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం. .గండేపల్లి మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన ఎస్.రామకృష్ణ పలు ద్విచక్రవాహనాలను దొంగిలించాడు. జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదు అయిన కేసుల్లో అతనిని అరెస్టు చేసి 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

గడ్డి మందు తాగిన యువకుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్థానిక గణేష్ కాలనీకి చెందిన పిట్ట రాజేష్ (23) మృతి చెందాడు. 20 రోజుల క్రితం సామర్లకోట బ్రౌన్ పేట సెంటర్లో మెయిన్ రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేస్తున్న పిట్ట రాజేష్ వీడియోలను తీసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని కొందరు యువకులు బెదిరించారు. మనస్తాపానికి గురైన అతను గత నెల 25వ తేదీ రాత్రి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాటి నుంచి కాకినాడలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే గురువారం అతని ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

60 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసామన్నారు. దీనికి సంబంధించి ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. జి.కొత్తూరు గ్రామంలో బెల్లం వ్యాపారిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఘర్షణ
-21 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఒక వివాహ వేడుకలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో 21 మంది స్వల్పంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. జి.రాగంపేట గ్రామంలో శుక్రవారం ఉదయం జి.రాగంపేటకు చెందిన అబ్బాయికి, ఐ.పోలవరం మండలం ఎదురులంక పంచాయతీ గుత్తుల వేమవరంకు చెందిన అమ్మాయికి వివాహం జరిగింది. అనంతరం డిజె పాటలు విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో 21 మంది స్వల్పంగా గాయపడగా వారిని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

ఇంటి వద్ద నుంచి అదృశ్యమైన వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జొన్నాడ గౌతమి గోదావరి నది చెంతన ఉన్న వ్యవసాయ పొలంలో శుక్రవారం వెలుగుచూసింది. ఎఎస్ఐ సూర్యచంద్రరావు తెలిపిన వివరాలు ఇవి. రావులపాలెంకు చెందిన కుడిపూడి శ్రీను(39) ఇంటి దగ్గర నుంచి అదృశ్యమై అనుమానాస్పద స్థితిలో మృతి చెందారన్నారు. తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుని 25 గాయాలు ఉండగా, ఘటన స్థలంలోవివరాలు సేకరించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. దీనిపై మృతుని తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు మత్స్యకారుడి మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పిడుగుపాటుకు వేటాడుతున్న మత్స్యకారుడు మృతి చెందాడు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చల్లపల్లి పంచాయతీ శివర గ్రామమైన వాసాలతిప్పకు చెందిన కర్రి లీలా కృష్ణ (39) శుక్రవారం ఉదయం గ్రామంలోని చెరువుల వద్దకు వేటకు వెళ్లాడు. లీలా కృష్ణ చేపల వేటాడుతుండగా అకస్మాత్తుగా అతనిపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లీలా కృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లీలా కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని కోమటికుంట పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు దేవరపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ దాడులలో సారాయి తయారీ నిల్వ ఉంచిన 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారా తయారు చేస్తున్న చుక్కా సుబ్బారావును అరెస్టు చేసినట్లు తెలిపారు. గోపాలపురంలో సారా అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఆక్రమణల నివారణకు చర్యలు : జెసి

ప్రజాశక్తి - కాకినాడ


అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

జిల్లాలోని చెరువులు, కాలువలు, డ్రెయిన్లు, వాగులు తదితర వాటర్ బాడీస్ ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వాటర్ బాడీస్ సంరక్షణపై జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ తొలి సమావేశం జెసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణలు, దుర్వినియోగాల వల్ల జలవనరులు అంతరించి దుష్పరిణామాలకు దారి తీసే పరిస్థితులు ఉంటాయన్నారు. కావున రెవెన్యూ అధికారుల అధ్యక్షతన, మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ తదితర శాఖల అధికారుల సభ్యులుగా జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో ఈ వాచ్ డాగ్ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా రికార్డులలో నమోదైన చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు, డ్రెయిన్లు తదితర వాటర్ బాడీస్ వివరాలను పరిశీలించి, వీటిలో ఇప్పటికే గురైన వ్యవస్థలను గుర్తించాలని, అలాగే ఇకపై ఆక్రమణలు జరుగకుండా నిరోధించాలని ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీ, మున్సిపల్, కుడా యాజమాన్యంలో ఉన్న చెరువులకు కంచెలు ఏర్పాటు ద్వారా పరిరక్షించాలని సూచించారు. కాలువలు, చెరువుల గట్లను డంపింగ్ యార్డులుగా వాడకూడదన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లోని కాలువ గట్లపై కొబ్బరి బొండాలను, కూల్చిన భవన శిధిలాలు డంప్ చేయడం వల్ల ప్రవాహాలు కుచించుకుపోతున్నాయని, కాలువలను ధ్వంసం చేస్తున్నా వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గ్రామాలు, పట్టణాల్లోని జనావాసాల మురుగునీరు కాలువలు, చెరువుల్లోనికి విడిపెట్టకుండా నిరోధించాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా నిర్వహిస్తామని, వచ్చే సమావేశానికి జిల్లాలోని వాటర్ బాడీల వివరాలు, వాటిలో జరిగిన ఆక్రమణలు, ఆక్రమణ విస్తీర్ణంలో ఉన్న పంటల సాగు, సివిల్ నిర్మాణాల వివరాలు, కోర్టు వివాదాలు, ఇకపై ఆక్రమణలకు గురికాకుండా చేపట్టిన చర్యలపై సమగ్ర వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, మున్సిపల్ ఇన్‌ఛార్జి ఆర్.నాగనరసింహారావు, డిపిఒ వి.రవికుమార్, ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఇరిగేషన్ ఇఇ శేషగిరిరావు, కాలుష్య నియంత్రణ మండలి, కుడా, డ్రెయినేజి, మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.


ఉత్తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఇ సెట్ సత్తా చాటిన ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇ-సెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ ఎన్ సతీష్‌రెడ్డి తెలిపారు. ఎపి ఇ-సెట్ 2025 పరీక్ష ఫలితాలలో తమ ఆదిత్య విద్యార్థులు మద్దూరి వినయ్ స్టేట్ 5వ ర్యాంకు, చీకోలు అమృత స్టేట్ 8 ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయి టాప్ 10లో 2 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వీటితోపాటు 100 లోపు మొత్తం 41 ర్యాంకులను తమ కళాశాల విద్యార్థులు సొంతం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్.కుమార్, డీన్ ఎవి.మాధవరావు, అసోసియేట్ డీన్ పి.శ్రీనివాస్ వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.


విజయం సాధించిన హరికృష్ణ, చరణ్ రామ్

బాడ్మింటన్‌లో హరికృష్ణ ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేటకు చెందిన వి.హరికృష్ణ తోటి క్రీడాకారుడు టి.చరణ్‌రామ్‌తో కలిసి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాడ్మింటన్ బాయ్స్ డబుల్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభను చాటాడు. మే 13న బీహారలో జరిగిన బాడ్మింటన్ బాయ్స్ డబుల్స్ విభాగంలో తమిళనాడుకి చెందన నెంబర్ వన్ సీడ్ విశ్వజిత్‌రాజ్, నిరంజన్‌పై 19 - 21, 21 - 19, 21 - 16 తేడాతో విజయం సాధించారు. ఖేలో ఇండియా బ్యాడమెంటేన్‌లో ప్రతిభను కనపరచిన హరికృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు.

వైద్యానికి ఎంఎల్‌ఎ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సామర్లకోట


బాజతునికి నగదును అందిస్తున్న టిడిపి నాయకులు

మండలంలోని హుస్సేన్ పురం గ్రామానికి చెందిన పుప్పాల పూర్ణదుర్గాప్రసాద్ వైద్యానికి ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. హుస్సేన్‌పురం గ్రామ టిడిపి అధ్యక్షులు చల్లా బుజ్జి బాధితుడు అనారోగ్య పరిస్థితిని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రూ.50 వేలు ఆర్థిక సాయం చేయడంతోపాటు, అతని ఆరోగ్య భద్రత కోసం అవసరమైన సాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారని బుజ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట చిన్నఅప్పారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తాళ్ళరేవు


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

మండలంలో సుమారు రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపిపి ఎంపిపి రాయుడు సునీత తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంపి హరీష్ మాధుర్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు సహకారంతో మండలంలో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. మండల పరిషత్ నిధులు రూ.కోటితో అన్ని గ్రామాల్లోనూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.10 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేశామని తెలిపారు. మరో రూ.3 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మండల అభివృద్ధికి సహకరిస్తున్న ఎంపి, ఎంఎల్‌ఎలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపిఒ సత్యనారాయణ, టిడిపి నాయకులు రాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌కు కుమార్ అభినందన

ప్రజాశక్తి - సామర్లకోట


జవహర్‌ను సత్కరిస్తున్న కుమార్, యార్లగడ్డ శేఖర్

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ పదవిని కెఎస్.జవహర్‌కు ఎఐఎండిఎస్ జాతీయ అధ్యక్షులు, టిడిపి నాయకులు కాపవరపు కుమార్ అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక బళ్ళ మార్కెట్ సెంటర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపినట్టు తెలిపారు. పార్టీ కోసంకష్టపడిన జవహర్‌కు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ పదవి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తింపును ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు యార్లగడ్డ శేఖర్, సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ అడబాల వీరభద్రరావు, వనమాడి ఉమాశంకర్, కాపవరపు జాను, బోస్, పాల్గొన్నారు.

21 నుంచి 24 వరకు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - కాకినాడ

సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్ మాల జాతీయ రహదారి నిర్మాణపనుల్లో భాగంగా ఈ నెల 21 నుంచి 24 వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లుకలెక్టర్ షాన్ మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట రోడ్డు ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ పనుల వల్ల నాలుగు రోజులు ట్రాఫిక్ నిలుపుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే అచ్చంపేట నుంచి సామర్లకోట వరకు జరుగుతున్న రహదారి పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్‌లో గడ్డర్లు లేపుతున్నందున ఈ నెల 27, 28 తేదీలలో (రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు) రెండు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, వాహనదారులు గమనించి పోలీసు వారు సూచించిన మార్గాలలో తమ వాహనాలను నడుపుకోవాలని కలెక్టర్ తెలిపారు.

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించరాదు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించరాదని పోలీసు కానిస్టేబుల్ దిలీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మానవ తప్పిదాలేనని అన్నారు. వేగంగా వాహనాలు నడపడం, మద్యం తాగి వాహనాన్ని నడపడం, ఓవర్ టేకింగ్, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం వలన అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

రాయితీ రుణాలపై అవగాహన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీ రుణాలపై డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉప్పాడ మహిళా సమాఖ్య కార్యాలయంలో మత్స్యకార మహిళలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిపిఎం బాబురావు మాట్లాడారు. ఎండు చేపల తయారీపై మత్స్యకారులకు రాయితీ రుణాలను ప్రభుత్వం అందిస్తుందని, మత్స్యకార మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేశవరావు, వెంకటేశ్వరరావు, డిఐసి విజయ్‌కుమార్, ఎపిఎం తవుడు, సిసి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాంపుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఇసుక రీచ్‌ల నుంచి లోడుతో వెళుతున్న వాహనాల నుంచి జారి పడుతున్న ఇసుక వల్ల ప్రమాదాలు జరగకుండా ర్యాంపుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దారు భారతి, ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. బోట్ మాన్ సొసైటీ సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇసుక లోడుతో బయలుదేరిన లారీల నుండి ఇసుక రోడ్డుపై పడడంతో తరచూ వాహనదారులు ఇబ్బందులు గురి అవుతుండడంతో ప్రమాదాల నివారణకు కొన్ని ప్రాంతాల్లో, ముఖ్య కూడళ్ళలో స్పీడ్ బ్రేకర్లు బిసినప్పటికీ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి రావడంతో ఈ సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఇసుక లోడుతో వెళ్లే లారీలపై బరకాలు కప్పడంతోపాటు ఆయా రాంపుల వద్ద అద్దాలు ఏర్పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిం చారు. సమావేశంలో ఆర్ఐ రామకృష్ణ బోట్ మెన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో యువతకు ఉద్యోగ భరోసా

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్ర యువతకు ఉద్యోగ భరోసా కల్పించే విధంగా నైపుణ్య శిక్షణ కార్పొరేషన్ పని చేస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ శుక్రవారం తెలిపారు. విజవాడలోని నైపుణ్య శిక్షణ కార్పొరేషన్ కార్యాలయంలో ఎండి జి.గణేష్‌కుమార్‌తో ఎంపీ హరీష్ సమావేశమయ్యారు. ఇటీవల ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తో హరీష్ జరిపిన చర్చల కొనసాగింపుగా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. స్కిల్ ఇండియా మిషన్ లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ కార్యక్రమాల పురోగతి, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై ఈ సమావేశంలో సమీక్షించా మన్నారకు. ఈ ప్రాజెక్టులో ఎదుర్కొంటున్న సమస్యలను, సవాళ్లను వారిని పరిష్కార మార్గాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.యువతను నైపుణ్యంలో తీర్చిదిద్ది వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఈ లక్ష్యాల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆత్మనిర్భర్ భారతదేశం దిశగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేస్తున్నాయని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

ఇసెట్ ర్యాంకర్లకు పలువురి అభినందనం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఇటీవల ఇసెట్ ఫలితాల్లో పలువురు ప్రతిభ కనబరచి ర్యాంకులు సాధించారు. వీరికి పలువురు శుక్రవారం అభినందనలు తెలిపారు.వివరాలు ఇవి..

అమలాపురం: ఇటీవల ప్రకటించిన ఇ సెట్ లో సివిల్ ఇంజినీరింగ్ విభాగం లో అమలాపురానికి చెందిన పితాని యజ్ఞేశ్వరి రాష్ట్ర స్థాయి 28వ ర్యాంక్ సాధించింది. శు ఆమెకు పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇఇ అన్యం రాంబాబు, ఇఇ పులి రామకృష్ణా రెడ్డి, కాంట్రాక్టర్ ఆంజనేయరెడ్డి, ఎఇఇలు సత్యనారాయణ, కొండలరావు తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు. **మామిడికుదురు:** ఎపి ఇసెట్‌లో (అగ్రికల్చరల్ ఇంజినీరింగ్)ఆదుర్రుకు చెందిన గుబ్బల సాయి మణిరత్నం రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించారు. మణిరత్నం తండ్రి లక్ష్మణరావు, తల్లి శ్యామలాదేవి వ్యవసాయం కుటుంబానికి చెందిన వారు. మణిరత్నం మాట్లాడుతూ రైతులకు అందుబాటులో మేలైన యంత్ర పరికరాలు తయారు చేయాలని, అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యముతో వ్యవసాయ శాస్త్ర వేత్త గా గుర్తింపు పొందాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. ఇ సెట్ లో (బి ఎస్‌సి మ్యాథమెటిక్స్‌లో) మొగలికుదురుకు చెందిన గోగి మోహిని స్పందన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాస్థాయిలో 8 వ ర్యాంకు సాధించారు. ఆమె తండ్రి సత్యనారాయణ రైతు, తల్లి వెంకటలక్ష్మి గృహిణి. స్పందన మాట్లాడుతూ బిటెక్ పూర్తి చేసి సివిల్స్ చదవాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

గోదావరిలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రమాదవశాస్తు కాలుజారి ఒక యువకుడు గౌతమీ గోదావరి నదిలో గల్లంతైన సంఘటన ఆత్రేయపురంలో చోటుచేసుకుంది. పోలీసు వివరాలు ప్రకారం ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తలపాకుల జగపతిబాబు హైదరాబాదులో ఒక కంపెనీలో ఆఫీస్ బాయ్ గా పని చేస్తున్నాడు. ఆత్రేయపురం బుల్లి పేట లో ఉన్న తన మేనమామ కుమారుడు పుట్టినరోజు వేడుకలకు శుక్రవారం వచ్చాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గౌతమి గోదావరి నది తీరానికి బహిర్భూమికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ జగపతిబాబు ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ రాము తెలిపారు...

కౌలు రైతుల గుర్తింపు కార్డుల దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు కౌలు కార్డులు (సిసిఆర్‌సి) పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దారు శ్రీనివాస్ కోరారు. ఇది కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు పొందడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కౌలు రైతులు తమ దరఖాస్తులను పూర్తి చేసి, అవసరమైన పత్రాలతో పాటు సమర్పించాలని తహశీల్దారు సూచించారు. కౌలు రైతు సాగు చేస్తున్న భూమికి సంబంధించిన వివరాలు, భూ యజమాని పేరుతో సహా స్పష్టంగా పేర్కొనాలని, దరఖాస్తుదారుని ఆధార్ కార్డు కాపీ జతపరచాలని తెలిపారు. ఇటీవల తీసిన పాస్‌పోర్ట్ సైజు ఫోటో, దరఖాస్తుదారుని సంప్రదించడానికి ఫోన్ నంబర్ ఇవ్వాలని తెలిపారు. కౌలు రైతులు ఏ గ్రామంలో వ్యవసాయం చేస్తున్నారో, ఆ గ్రామంలోని విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, గ్రామ వ్యవసాయ సహాయకులకు తమ దరఖాస్తులను అందజేయాలని, ఈ దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన రైతులకు సిసిఆర్‌సి కార్డులు జారీ చేస్తామని తెలిపారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సకాలంలో దరఖాస్తు చేసుకుని కౌలు కార్డులు పొందాలని ఆయన సూచించారు.

ఆకతాయిలకు శిక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

మండపేట పట్టణంలో గురువారం రాత్రి మద్యం తాగి న్యూసెన్స్ చేస్తున్న పదిమంది నిందితులను స్థానిక ఎస్ఐ అరెస్టు చేసి శుక్రవారం ఆలమూరు సివిల్ కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో వారందరికీ జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్ రూ.100 జరిమానాతో పాటు వారితో పరిసరాలను శుభ్రం చేయించాలని శిక్షను విధించారు. దీంతో పోలీసుల పర్యవేక్షణలో స్థానిక ట్రెజరీ కార్యాలయాన్ని వారితో అధికారులు శుక్రవారం శుభ్రం చేయించారు.


నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత బృందంతో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ సుఖ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు, సుఖ వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై వీధి నాటకం ద్వారా వివరించారు. ఈ నెల 13 నుంచి 19 వరకు నటరాజ నిలయ చర్మచిత్ర కళా ప్రదర్శన కమిటీ ద్వారా కళాజాత బృందాలతో వీధి నాటకాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మేనేజర్ నవీన్‌చంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు అహ్మద్ భాష, ఐసిటిసి కౌన్సిలర్ ఎన్.లక్ష్మి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెటరీ పరీక్షలు పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట


కళాశాలను సందర్శించిన డిఐఇడి శారద

సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీ డియేట్ అడ్వాన్స్ సప్లిమెం టరీ పరీక్షల నిర్వహణను శుక్రవారం డిఐఇడి ఐ.శారద పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేవారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. 353 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సివుండగా 11 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్టు ప్రిన్సిపల్ సిహెచ్‌ఎల్ శ్రీదేవి తెలిపారు.

పంట బోదెలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి - ఆలమూరు

పెదపళ్ల గ్రామంలో పంట బోదెలో పూడిక శుక్రవారం తొలగించారు. ఈ పనులను చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ గారపాటి శ్రీనివాసరావు పరిశీలించారు. మండలంలోని పెదపళ్ళ గ్రామంలో మురుగు నీరు పంట బోదెలో నిలువ ఉండి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని శ్రీనివాసరావు దష్టికి రైతులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఎంపిడిఒ ఎ.రాజు, గ్రామ సర్పంచ్ సత్యశ్రీ మెహర్ ప్రసాద్, సెక్రెటరీ వేణిలతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. దీంతో ఎంపిడిఒ రాజు పంచాయతీ అధికారులకు పరిశుభ్రం చేయించాలని ఆదేశించారు. పంటబోదెలో శుక్రవవారం పూడిక తొలగి ంచారు. కార్యక్రమంలో విఆర్‌ఓ ఉదయ్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ఆధునికీకరించాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి లంక లో రోడ్డు ఆధునికీకరించాలని గ్రామంలో ఒఎన్‌జిసి డ్రిల్లింగ్ సైట్ ఎదుట శుక్రవారం రైతులు ధర్నా నిర్వహించారు. సుమారు 200 అడుగులు మేర రోడ్డు నిర్మించాలంటూ రైతులు డిమా ండ్ చేశారు. దీనికి సంబంధించి వినతి పత్రాన్ని డిల్లింగ్ సైట్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ కు అందజేశారు.